క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం

వత్సవాయి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వత్సవాయి మండల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షులు గుత్తా శంకరరావు తెలిపారు. ఆయన శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. వత్సవాయిలోని శ్రీవాసవీ కల్యాణమండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు



పెనుగంచిప్రోలు: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు విడనాడాలని పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి కోరారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెనుగంచిప్రోలులో ర్యాలీ నిర్వహించడంతోపాటు పోలీస్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యక్తిగతపరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమనే విషయాన్ని గమనించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెరువుకట్ట వద్ద పార్క్ స్థలంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ కె.సుబ్బారావు, వీఆర్వో సుధశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ ఉప ప్రధానార్చకులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారిని శనివారం తిరుమల తిరుపతి దేవస్థాన ఉప ప్రధానార్చకులు సాయిస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పెంచిన విద్యుత్ చార్జీల రద్దుకు డిమాండ్



పెనుగంచిప్రోలు: అన్నిరకాల విద్యుత్ చార్జీలు పూర్తిగా రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వల్లపుదాసు గురవయ్య డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, సర్దుబాటు చార్జీల రద్దుతోపాటు స్మార్ట్ మీటర్లు తొలగించాలని కోరుతూ శనివారం గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, మళ్లీ పెంచబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి పార్టీ నాయకులు, అధికారంలోకి వచ్చాక చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు గజ్జి పెద్దిరాజు, తురక కొండలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు



పెనుగంచిప్రోలు: ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేయాలని నందిగామ డీవైఈఓ సాంబశివరావు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బోధన పద్ధతులు, విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఉపాధ్యాయులకు వివరించారు. ఎంఈఓ డి.రవీంద్ర, హెచ్ఎంలు కె.జలజ, ఎన్.బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వీధి దీపాలు ఏర్పాటు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఐదోవార్డు, చింతలతోపులో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఆరునెలలుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతుండగా, సమస్యను కౌన్సిలర్ వట్టెం మనోహర్ పలు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. పలుమార్లు మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్లకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చింతలతోపు లో శనివారం పది వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా పనులను కౌన్సిలర్ మనోహర్ పర్యవేక్షించారు.

మోసం సీఎం చంద్రబాబు నైజం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

పెద్దాపురం(వీరులపాడు): ప్రజలను నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో అథమస్థానంలో ఉన్న సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, ప్రజలపై భారాలు మోపడంలో మాత్రం ప్రథమ స్థానంలో ఉందని ఎద్దేవా చేశారు. మండలంలోని పెద్దాపురంలో జెడ్పీటీసీ మాజీసభ్యుడు కోటేరు ముత్తారెడ్డి నివాసంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై శనివారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి 'చెప్పారంటే చేస్తారంతే' అనేంత మంచిపేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు.

రైతులను రోడ్డున పడేశారు..

కూటమి పాలనలో వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని జగన్‌మోహనరావు ఆవేదన వ్యక్తంచేశారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుగాక, పంటలసాగుకు పెట్టుబడి సాయం అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. మిర్చి, పత్తితోపాటు అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం శోచనీయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో రైతుభరోసా, ఉచిత పంటల బీమా పథకం అమలుతో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతుపక్షపాతిగా నిలిచారని కొనియాడారు.



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, వీరులపాడు మండల నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పేదలపై మోయలేని భారం...

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో పేదలపై మోయలేని భారం వేసిందని జగన్‌మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చేందుకు హామీలివ్వడం.. తీరా అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయకుండా ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. చంద్రబాబు ఏడాది పాలన మోసాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం విస్మరించిన హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, నాయకులు షేక్ షహనాజ్‌బేగం, నువ్వుల విశ్వనాథం, షేక్ నాగుల్‌మీరా, కోటేరు సూర్యనారాయణరెడ్డి, వేమూరి ఆదాం, మారపాక మహాలక్ష్మి,, బండి విజయ్‌పాల్‌రెడ్డి, చలమల దుర్గయ్య, నిప్పులపల్లి శాంతమ్మ, శీలం సంధ్య, బండి సునీత, కోట సంగయ్య, పచ్చాల కోటేశ్వరరావు, వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఐలూరి నర్సిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలకు కేరాఫ్ చంద్రబాబు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రిగా 15ఏళ్ల అనుభవమున్న చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసపూరిత మాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. షేర్‌మహ్మద్‌పేటలోని వేణుగోపాలస్వామి ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై జగ్గయ్యపేట మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలిచ్చి ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను గాలికొదిలి సుపరిపాలన–తొలి అడుగు అంటు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను మరోసారి ఏమార్చుతున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన నాటినుంచి ఇష్టారీతిన కేసులు నమోదు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వారిష్టానుసారం పాలన సాగిస్తుండటం తగదని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలు చెత్తబుట్టకు పరిమితం చేశారన్నారు. ఆయా హామీల అమలుకు వైఎస్సార్ సీపీ తరఫున ప్రజల పక్షాన పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు, చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ పెంటు శ్రీనివాసరావు, జిల్లా ప్రధానకార్యదర్శి చింతకుంట్ల వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంబూరి రవికుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శినాల వెంకటనారాయణ, నాయకులు మట్టా ప్రతాప్‌రెడ్డి, మోరే దుర్గాప్రసాద్, జువ్వాజి నరసింహారావు, చల్లా సుశీల, బండి రాజు, గూడపాటి శేషయ్య, అన్నాబత్తుల శ్రీనివాసరావు, కొత్తపల్లి పెంటయ్య, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు

నందిగామ టౌన్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులుగా పేపరు, జూట్ బ్యాగులుత వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక నష్టాలు..

ప్లాసిక్ వినియోగంతో కలిగే నష్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు షేక్ సైదా, యరగొర్ల రామారావు సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని కోరుతూ నందిగామ లోని ఉర్దూ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. పాఠశాల హెచ్ఎం షాహిదా బేగం, ఉపాధ్యాయులు మహమ్మద్ జాఫర్, సుల్తానా బేగం, రహీమతున్నిసాబేగం, రహీమున్నిసా పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మండలంలోని కీసర, కంచికచర్లలో శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర– కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో బీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్, క్లాత్ సంచులను వినియోగించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఇందుపల్లి నానిబాబు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు, ఉపాధ్యాయులు

రైతుబజారులో...

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని రైతుబజారులో శనివారం రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ కేవీ రమణ ఆధ్వర్యంలో రైతులు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుబజారు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగానికి బదులుగా జూట్ సంచులు వాడాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. జగ్గయ్యపేట పట్టణంలో శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్ వెంకట్, పాందూరి సుధాకర్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



పేట రైతుబజారులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, రైతులు



గండ్రాయిలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ లూర్దుమేరీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు

జగ్గయ్యపేట మండలంలో...

గండ్రాయి(జగ్గయ్యపేట): ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలంటూ మండలంలోని గండ్రాయిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. సర్పంచ్ కొత్తపల్లి లూర్దుమేరీ, కార్యదర్శి సాయి సంధ్య, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

కంచికచర్ల: అత్యవసర వేళల్లో పోలీసు రక్షణ కోసం విద్యార్థులు శక్తియాప్‌ను వినియోగించాలని శక్తి టీమ్ కోఆర్డినేటర్, ఏఎస్ఐ బంటు హనుమయ్య సూచించారు. చందర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హనుమయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏదేని సమస్య వచ్చినట్లయితే తక్షణమే సమీపంలోని పోలీసులు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు.బాలురు బాలికలతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి విద్యార్థినులకు వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలపై గౌరవభావం కలిగి ఉండాలన్నారు. జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకోవాలంటే కష్టపడి చదవడం ఒక్కటే మార్గమని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శక్తి టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: మహిళలు, విద్యార్థినుల భద్రతకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ అభిమన్యు తెలిపారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థినులకు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌తో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాలలో 112కు ఫోన్‌చేయడం, శక్తి యాప్ వినియోగంతో సురక్షితంగా బయటపడొచ్చన్నారు. ముఖ్యంగా డ్రగ్స్, మత్తుపదార్థాల కారణంగా జీవితాలు దుర్భరమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శక్తి టీమ్ కోఆర్డినేటర్ హనుమయ్య

అమ్రితసాయిలో ఏఐపై వర్క్‌షాపు



శాస్త్రవేత్త సాధు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబాద్‌కు చెందిన సీ–డాక్ శాస్త్రవేత్త సాధు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కీలకంగా మారిందన్నారు. ఏఐ ద్వారా టెక్స్ట్ టు ఇమేజ్, ఇమేజ్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్ సులువుగా మారుతుందన్నారు. కంప్యూటర్ శక్తి పెద్దమొత్తంలో డేటా లభ్యం కావడం, సైద్ధాంతిక అవగాహనలో పురోగతి తర్వాత ఏఐ పరిశోధనలు తిరిగి పుంజుకున్నాయని వివరించారు. ఆర్టిఫిషియల్ టెక్నాలజీ పరిశ్రమలో ముఖ్యమైన భాగంగా మారిందన్నారు. కంప్యూటర్ సైన్స్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కార్యకలాపాల పరిశోధనల్లో అనేక సవాళ్లను సమస్యలను పరిష్కరించడంలో సహాయకారిగా మారిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం శాస్త్రవేత్త శ్రీనివాస్‌ను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు, సీఈఓ కె.సాయిమనోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళనలో ఏఈ కిషోర్ కుటుంబం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తనచావుకు జలవనరులశాఖ ఈఈ గంగయ్య, డీఈఈ ఉమాశంకర్, ఈఎన్‌సీ బి.శ్యామ్‌ప్రసాద్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుయే కారణమంటూ లేఖరాసి అదృశ్యమైన ఇరిగేషన్ ఏఈ కిషోర్ ఆచూకీ ఇప్పటివరకు లభించకపోవడంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన కిషోర్ తిరువూరు నియోజకవర్గం జలవనరులశాఖలో ఏఈ పనిచేస్తూ శుక్రవారం నుంచి కనిపించడం లేదు. తాను బదిలీ అయినా రిలీవ్ చేయకుండా ఉన్నతాధికారులు మానసికంగా వేధిస్తున్నారని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆయన ఆలేఖలో పేర్కొనడం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో స్వగ్రామం అనిగండ్లపాడులో శనివారం కిషోర్ తల్లి అనసూర్య, సోదరి శిరీష మాట్లాడుతూ నెలరోజులుగా కిశోర్ మానసిక వేదనకు గురవుతున్నాడన్నారు. తిరువూరు నుంచి జగ్గయ్యపేట మండలం గౌరవరం ఎన్నెస్పీ సెక్షన్‌కు బదిలీ అయినా రిలీవ్ చేయకుండా ఇరిగేషన్ అధికారులతో పాటు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇబ్బందులు పెడుతున్నారంటూ తమతో చెప్పుకుని బాధపడ్డాడన్నారు. బదిలీ విషయమై జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఎంపీ కేశినేని శివనాథ్‌లను సంప్రదించాడన్నారు. నెల రోజులుగా ఎంతో ఇబ్బంది పడుతున్నాడని, ఈ క్రమంలో ఇలా అదృశ్యమయ్యాడని వారు వాపోయారు. సూసైడ్ నోట్‌పై రక్తపు మరకలు ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. తమ కుమారుడికి ఏదైనా జరిగితే తట్టుకోలేమని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరారు. కిషోర్ ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, ఇరిగేషన్ సిబ్బంది ఎదురుచూస్తున్నారు.



ఆందోళన చెందుతున్న కిషోర్ తల్లి అనసూర్య, సోదరి శిరీష

అప్రమత్తతోనే నేరాలకు చెక్

కంచికచర్ల: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ సీఎస్ఎన్ ఏరియా కోఆర్డినేటర్ కొనకాల జగన్ సూచించారు. కంచికచర్ల గౌతమి స్కూల్, వీరులపాడు మండలం జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల జరిగే తీరును తెలియజేసి, అప్రమత్తత ఆవశ్యకతను వివరించారు. గౌతమి స్కూల్ కరస్పాండెంట్ రామారావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

నందిగామరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు శనివారం తమ నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీగా వెళ్లి గాంధీ సెంటరులోని గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మిక సంఘ నాయకులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్, నాయకులు పరిమి రవి, దారెల్లి అశోక్ కుమార్, కండెల శ్రీను, మార్కపూడి దాసు, బ్రహ్మం, బాల్, ఆనంద్ ఇందూరి, ప్రమీల, బేబీ పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఎత్తిపోతల పథకం పరిశీలన

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకాన్ని పేట, నందిగామ ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, తంగిరాల సౌమ్య, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాంలతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నీటిపారుదల శాఖకు రూ. 500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యంగా వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకానికి రూ.15 కోట్లతో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఎండీ తిరుమలరావు, నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



వేదాద్రి-కంచల ఎత్తిపోతలను పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు సౌమ్య, తాతయ్య

చింతిర్యాలకు బస్సు సర్వీస్ పునరుద్ధరణ

జగ్గయ్యపేట అర్బన్: తెలంగాణలోని చింతిర్యాలకు కొంత కాలంగా నిలిచిపోయిన బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చింతిర్యాల బస్సు సర్వీసును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలోని చింతిర్యాల గ్రామానికి బస్సు సర్వీసును నిలిపివేశారని తెలిపారు. గ్రామ ప్రజల ఆకాంక్షను గుర్తించి చింతిర్యాల బస్సు సర్వీసును పునరుద్ధరించినట్లు వివరించారు. ఈ కొత్త బస్సు సర్వీసు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మల్లారెడ్డిగూడెం మండలం, దొండపాడు, శోభనాద్రిగూడెం, మల్లారెడ్డిగూడెం మీదుగా చింతిర్యాలకు నడపబడుతుందని వివరించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, ఆర్టీసీ ఆర్ఎం వై.దానం, ఆర్టీసీ ఈడీ విజయరత్నం, డిపో మేనేజర్ కె.కృష్ణారావు, నాయకులు కొఠారి సత్యనారాయణప్రసాద్, దొరబాబు, కొండారెడ్డి, వెంకట్, కోటిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య, అధికారులు, నాయకులు

సమ్మెకాలపు హామీల అమలుకు డిమాండ్

నందిగామరూరల్: ఆశ కార్యకర్తలకు పని భారం తగ్గించటంతోపాటు సమ్మెకాలపు హామీలను తక్షణమే అమలు చేయాలని ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో శనివారం నందిగామ మండల ఆశావర్కర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ ఆశావర్కర్ల ఉద్యోగ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలన్నారు. గ్రాడ్యుయేషన్, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. లింగాలపాడు కమిటీ అధ్యక్షురాలిగా మన్నెం తిరుమలదేవి, కార్యదర్శిగా వనజ, కోశాధికారిగా కవిత, గోళ్లమూడి కమిటీ అధ్యక్షురాలిగా మార్తమ్మ, కార్యదర్శిగా ఆదిలక్ష్మి, కోశాధికారిగా సునీత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కమల